పాత నగరానికి మహర్దశ

పాతనగరం అభివృద్ధిపథాన సాగుతోంది. గతంలో పెద్దగా అభివృద్ధికి నోచుకోని ఈ ప్రాంతం వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రూపురేఖలు మార్చుకుంటోంది. రోడ్లు, డ్రైనేజీలు, కాలువలు, మంచినీటి సదుపాయం వంటి మౌలిక వసతులు సమకూరుతున్నాయి. జగనన్న ప్రభుత్వం వచ్చాక తమ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- కోట్లాది రూపాయలతో రోడ్ల నిర్మాణం
- భారీ వ్యయంతో బస్టాప్‌ల ఆధునికీకరణ
- మోడల్ జంక్షన్‌గా జగదాంబ కూడలి


రోడ్డు విస్తరణ పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి (ఫైల్)

డాబాగార్డెన్స్ : పాతనగరానికి మహర్దశ పట్టనుంది. ఇప్పటికే పలు అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయలతో శ్రీకారం చుట్టారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పనులు ఈ ప్రభుత్వ హయాంలో చురుగ్గా సాగుతున్నాయి. కోర్టు వివాదాల్లో నిలిచిపోయిన ఇతర పనుల నిర్వహణకు కూడా గ్రీన్ సిగ్నల్ రావడంతో ఆ పనులు సైతం జోరందుకున్నాయి. అందులో భాగంగా ఇప్పటికే బస్టాప్‌లు ఆధునికీకరించారు. తాజాగా.. జగదాంబ జంక్షన్ నుంచి పాత నగరం రాణిబొమ్మ వరకు రోడ్డు విస్తరణ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఇదిలా ఉండగా జగదాంబ జంక్షన్‌ను మోడల్ జంక్షన్‌గా నిలిపేందుకు రూ.2.3 కోట్లతో అభివృద్ధి పనులకు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేషకుమార్‌తో కలిసి భూమిపూజ చేశారు.

రూ.12.5 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు..

నగర రద్దీని దృష్టిలో పెట్టుకుని రోడ్ల విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి. జగదాంబ జంక్షన్ నుంచి పాత పోస్టాఫీస్ వరకు పూర్ణామార్కెట్ వద్ద రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి స్థానిక శాసన సభ్యుడు వాసుపల్లి గణేష్‌కుమార్‌తో కలిసి నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఇటీవలే భూమి పూజ చేశారు. సుమారు రూ.12.5 కోట్లతో 2.1 కిలోమీటర్ల మేర 60 అడుగుల రోడ్డు విస్తరణ పనులకు ఆమె భూమిపూజ చేశారు. విస్తరణతో జగదాంబ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీస్ వరకు రద్దీని తగ్గించవచ్చు.



బస్టాప్ ప్రారంభోత్సవంలో మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి తదితరులు

బస్టాప్‌ల ఆధునికీకరణ..

దక్షిణ నియోజకవర్గ పరిధి పలు ప్రాంతాల్లో అత్యాధునికంగా బస్ బేలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గ పరిధిలో జగదాంబ జంక్షన్, ఎల్ఐసీ, ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్‌గేట్, లలితా జ్యూయలరీ వద్ద వీటిని ఏర్పాటు చేశారు. రూ.25.93 లక్షలతో జగదాంబ జంక్షన్ వద్ద బస్టాప్, రూ.26.33 లక్షలతో ఎల్ఐసీ బిల్డింగ్ వద్ద, రూ.24.73 లక్షలతో ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్‌గేట్ వద్ద, రూ.26.45 లక్షలతో లలితా జ్యూయలరీ వద్ద బస్ బేలను ఆధునికీకరించడమే కాకుండా ఇటీవలే వాటిని ప్రారంభించారు.

ఘాట్‌రోడ్డు పనులు..

ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయానికి వెళ్లేందుకు భక్తులు ఎన్నో ఇబ్బందులు పడతున్న దృష్ట్యా.. దశాబ్దాల నాటి సమస్య పరిష్కరించేందుకు రంగం సిద్ధమయింది. ఘాట్‌రోడ్డు పనులు దాదాపు పూర్తయినప్పటికీ, అనివార్య కారణాలు, కోర్టు తగాదాల వల్ల ఘాట్‌రోడ్డు చివరి దశ పనులు రెండున్నరేళ్ల పాటు నిలిచిపోయాయి. కోర్టు వివాదం తొలగిపోవడంతో పనుల పూర్తికి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. దీంతో ఘాట్‌రోడ్డుకు లైన్ క్లియర్ అయినట్టే.

వైఎస్సార్‌సీపీలోకి 50 టీడీపీ కుటుంబాలు


వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్న టీడీపీ కుటుంబాలు

డాబాగార్డెన్స్ : నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి చెందిన 50 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. 30వ వార్డు కొత్తజాలారిపేటలోని జాలారి కమ్యూనిటీకి చెందిన చింతపల్లి బంగారి, చింతపల్లి రాజేష్, వాడమోదుల శ్రీనివాస్, చింతపల్లి రాజు, వాడమోదుల రాంబాబు, కాసారపు లక్ష్మి, జులమ్మ, పెద్దమ్మలు, మసీనమ్మతో పాటు పలువురు చేరారు. ఈ సందర్భంగా చింతపల్లి బంగారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి రెండూ రెండు కళ్లుగా భావించి సుపరిపాలన అందిస్తున్న కారణంగా 2024లోనూ జగన్‌మోహన్‌రెడ్డే మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని అన్నారు. అలాగే దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రతి పేదవాడికి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే చేస్తున్న సేవలను గుర్తించి పార్టీలో చేరినట్టు చెప్పారు. 2024 ఎన్నికల్లో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను గెలిపించుకుంటామని, తామంతా తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరినందుకు సంతోషిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, వార్డు అధ్యక్షుడు దశమంతుల మాణిక్యాలరావు, జేసీఎస్ ఇన్‌చార్జి కోన శంకర్, పార్టీ నాయకులు పెంటపల్లి సత్యనారాయణ, వేణుగోపాల్, శ్యామ్, రామరాజు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మీ ఇంటికి మీ కార్పొరేటర్

- 34వ వార్డు కార్పొరేటర్ పద్మావతి ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం

అల్లిపురం : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ఆమె బుధవారం నుంచి రోజుకి ఒక వలంటీర్ పరిధిలో గల 50 ఇళ్లకు స్వయంగా వెళ్లి వారితో మమేకమవ్వనున్నారు. దీంట్లో భాగంగా యాతపేట సచివాలయం పరిధిలో వలంటీర్లు శైలజ, లావణ్య, కన్వీనర్ పిల్లి సత్తిబాబుతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలన్నీ అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుంచి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకే పని చేస్తున్నారన్నారు. ఆయన ఆశయాల మేరకు తాను కార్పొరేటర్‌గా కృషి చేస్తానని తెలిపారు. ప్రతి రోజు 50 కుటుంబాలను స్వయంగా కలుసుకుంటానని ఆమె స్పష్టం చేశారు. వార్డు నాయకులు, కార్యకర్తలు దూడ అప్పారావు, దుర్గారావు, నాగమణి పాల్గొన్నారు.


ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ తోట పద్మావతి

నగర సుందరీకరణలో భాగంగా కూడళ్ల అభివృద్ధి

- జగదాంబ జంక్షన్ అభివృద్ధి పనుల శంకుస్థాపనలో మేయర్ హరి వెంకట కుమారి స్పష్టీకరణ

డాబాగార్డెన్స్ : నగర సుందరీకరణలో భాగంగా కూడళ్లను అభివృద్ధి చేస్తున్నట్లు మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. జోన్-4 పరిధి జగదాంబ కూడలి అభివృద్ధి పనులకు పార్లమెంట్ సభ్యుడు ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌తో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జగదాంబ కూడలితో పాటు క్లాక్ టవర్ నిర్మాణానికి రూ.2.3 కోట్ల స్మార్ట్‌సిటీ నిధులతో శంకుస్థాపన చేశామన్నారు. నగరంలో రద్దీ దృష్ట్యా జంక్షన్ల అభివృద్ధితో పాటు రోడ్ల విస్తరణ పనులు చేపడతామని, దీనిలో భాగంగా జగదాంబ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీస్ వరకు రోడ్డు విస్తరణ చేయనున్నట్లు తెలిపారు. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ విశాఖను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో విశాఖను సుందర నగరంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. త్వరలోనే విశాఖ పరిపాలన రాజధాని అవుతున్న దృష్ట్యా అందుకు తగిన విధంగా నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని, ఇప్పటికే బస్ బే, కూడళ్ల అభివృద్ధి, రోడ్డు విస్తరణ పనులు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, కార్పొరేటర్లు ఉరుకుటి నారాయణరావు, బిపిన్‌కుమార్ జైన్, జోనల్ కమిషనర్ శివప్రసాద్, స్మార్ట్‌సిటీ కార్యనిర్వాహక ఇంజనీరు, ఇతర జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, ఎంపీ ఎంవీవీ, ఎమ్మెల్యే వాసుపల్లి

క్లుప్తంగా

ఎమ్మెల్యే వాసుపల్లి ఔదార్యం


మహేష్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : జీవీఎంసీ 34వ వార్డులోని జెండా చెట్టు ప్రాంతానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కారి మహేష్ మృతి చెందిన విషయం తెలియడంతో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ బుధవారం ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు రూ.5 వేలు ఆర్థిక సహకారం అందజేశారు.

◆ అదే ప్రాంతానికి చెందిన కారి రాజుకు కత్తిపోటు వలన కిడ్నీ పూర్తిగా పాడవటం కారణంగా మందుల ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు ఆర్థిక సాయం చేశారు.

◆ 37వ వార్డు జబ్బర్‌తోట ప్రాంతానికి చెందిన సర్దార్ భగత్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిద్ధి వినాయక అనుపు కార్యక్రమానికి ఎమ్మెల్యే రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్థిక సహకారం అందుకున్న వారు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, సన్యాసిరావు, నొల్లి పోతుస్వామి సీనియర్ నాయకులు లండా రమణ, వెంకటలక్ష్మి, గద్దిపల్లి అప్పన్న, దూడ అప్పారావు, దేవి, సత్యవతి, కార్యకర్తలు రామరాజు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

యువకునిపై హత్యాయత్నం

అల్లిపురం : యువకునిపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటన టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం బంగారమ్మమెట్ట ప్రాంతానికి చెందిన పి.బాలభార్గవ స్థానికంగా గల సాయిప్రసన్న మెడికల్ ఏజెన్సీలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి గత ఏడాది కాలంగా పూతి వెంకటరెడ్డి, పూతి గణేష్‌రెడ్డితో స్నేహం కొనసాగుతోంది. అయితే పది రోజుల క్రితం పూతి వెంకటరెడ్డికి, బాలభార్గవ్‌కు గొడవ జరగటంతో వీరిద్దరు మాట్లాడుకోవడం లేదు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి ఒంటి గంట సమయంలో పూతి వెంకటరెడ్డి బాలభార్గవకు ఫోన్ చేసి నీలమ్మ వేపచెట్టు దగ్గరకి రమ్మని చెప్పడంతో భార్గవ అక్కడికి వెళ్లాడు. అక్కడ పూతి వెంకటరెడ్డితో పాటు పూతి గణేష్‌రెడ్డి, సబ్బి శ్రీనివాస్ ఉన్నారు. ఆ ముగ్గురిలో ఒకరు భార్గవ పీక పట్టుకుని, వారి వెంట తెచ్చుకున్న కత్తితో భార్గవ ఎడమ చేతి మీద, ఎడమ వైపు కడుపులో పొడవటంతో తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడి నుంచి తప్పించుకుని కేజీహెచ్‌కు చేరుకున్న భార్గవ చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మత సామరస్యానికి ప్రతీక విశాఖ

సీతంపేట: మత సామరస్యం ఆవశ్యకతపై అవగాహన కల్పించేందుకు బీవీ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, రెలిజియస్ ఫ్రీడం సంస్థల ప్రతినిధులు బుధవారం నగరంలో వివిధ మతాలకు చెందిన దేవాలయాలను సందర్శించారు. ఈ కార్యక్రమాన్ని ఆచార్య వి.బాలమోహన్‌దాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత సమైఖ్యతకు విశాఖ ప్రతీకని, నగర ప్రజలు శాంతికాములని, ఇతరులకు ఆదర్శప్రాయులని కొనియాడారు. దీనిలో భాగంగా పోర్టు వెంకటేశ్వరస్వామి ఆలయం, అక్కడే ఉన్న చర్చి, దర్గా, గురుద్వారాలను సందర్శించి వారి ఆచారాలు, సంప్రదాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నరవ ప్రకాశరావు, రాజశేఖర్, నరసింహరావు, గౌరీ శంకర్, ప్రజ్ఞాన్‌కుమార్, మహ్మద్ హుస్సేన్, రాజేంద్ర జైన్, బెనర్జీ పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద బుధవారం ప్రభుత్వ రేషన్ బియ్యం పంపిణీ చేశారు. ఇళ్ల వద్దకు రేషన్ వాహనం వచ్చి బియ్యం, పంచదార, కందిపప్పు అందజేశారు. రేషన్ కార్డుదారులు క్యూలో ఉండి సరుకులు తీసుకున్నారు.

మాజీ ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాస్‌కు ఘన నివాళి


ద్రోణంరాజు శ్రీనివాస్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి తదితరులు


బంగారుమెట్ట సచివాలయం వద్ద వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న మన్యాల శ్రీనివాస్


అన్నసమారాధనలో పాల్గొన్న శ్రీవత్సవ్

అల్లిపురం : నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, మాజీ వీఎంఆర్‌డీఏ చైర్మన్, మాజీ ప్రభుత్వ విప్ ద్రోణంరాజు శ్రీనివాసరావు మూడవ వర్ధంతి సందర్భంగా ఆయన అభిమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పెదవాల్తేరులోని ద్రోణంరాజు శ్రీనివాస్ స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ద్రోణంరాజు శ్రీవాత్సవ్‌ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర ప్రధాన కార్యదర్శి నీలాపు వెంకట రమణారెడ్డి, మాదాబత్తుల రమేష్, పచ్చిరిపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

33వ వార్డులో..

వార్డులోని బంగారుమెట్ట సచివాలయం వద్ద ద్రోణంరాజు శ్రీనివాస్ అభిమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కణితి బ్రహ్మం, పిల్లి శివ, కొడమంచిలి శ్రీను ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నీలాపు వెంకట రమణారెడ్డి, పార్టీ పార్లమెంట్ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్ పాల్గొని ద్రోణంరాజు శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే ఏపీ వెనుకబడిన కులాల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీ గాయత్రీదేవి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొణతాల శ్రీనివాస్ పాల్గొని ద్రోణంరాజు శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎస్.శ్రీహరి, కె.కాత్యాయని, కె.స్వాతి, ఎస్.మంగ, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద సంస్థలో..

డాబాగార్డెన్స్ : మాజీ ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాసరావు 3వ వర్ధంతి బుధవారం స్వామి వివేకానంద సంస్థలో నిర్వహించారు. మధ్యాహ్నం ప్రభుత్వ విక్టోరియా (ఘోషా) ఆస్పత్రిలో పేషెంట్ల సహాయకులకు భోజనాలతో పాటు మజ్జిగ పంపిణీ చేశారు. సాయంత్రం సంస్థ కార్యాలయం వద్ద సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీవత్సవ్ పాల్గొని ద్రోణంరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీవత్సవ్ మాట్లాడుతూ వివేకానంద సంస్థ అంటే తన తండ్రి శ్రీనివాసరావుకు ఎంతో అభిమానమని, సంస్థ నిర్వహించే అన్ని సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవారని చెప్పారు. అనంతరం వృద్ధులకు చీరలు పంపిణీ చేసి అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సభ్యులు, ద్రోణంరాజు శ్రీనివాస్ అభిమానులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం తగదు


ఫిషింగ్ హార్బర్ రోడ్డులో చెత్తను చూసి అసంతృప్తి వ్యక్తం చేస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ


ఎప్పటికప్పుడు చెత్త తీయకపోవడంపై శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై మండిపడుతున్న కమిషనర్

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

డాబాగార్డెన్స్ : పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ప్రజారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా బుధవారం జోన్-4 పరిధి 37, 38, 39 వార్డుల పరిధిలో ఉన్న రెల్లివీధి, ఫిషింగ్ హార్బర్, పోర్టు రోడ్డు, పూర్ణామార్కెట్ రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెల్లివీధి నుంచి దిగువరెల్లివీధి వరకు కాల్వల్లో వ్యర్థాలు సరిగ్గా తీయడం లేదని, చాలా ప్రాంతాల్లో చెత్త పోగులు కనిపిస్తున్నాయని, పలు ప్రాంతాల్లో రోడ్లపై పారిశుధ్యం సరిగ్గా నిర్వహించడం లేదని అన్నారు. వెంటనే కాలువలు, రోడ్లు శుభ్రం చేసి చెత్త పోగులు ఎత్తించాలని, కాలువలు శుభ్రం చేసిన వెంటనే ఆ ఫొటోలు కమిషనర్ కార్యాలయానికి పంపాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని, ఏ రోజు వ్యర్థాలు ఆ రోజే తొలగించి, డంపింగ్ యార్డ్‌కి తరలించాలన్నారు. అనంతరం పూర్ణామార్కెట్ రోడ్డు విస్తరణ పనులు పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, విద్యుత్ స్తంభాలను వెంటనే మార్చి రోడ్డు నిర్మాణానికి ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలని పట్టణ ప్రణాళికా, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

బ్యాగ్ అపహరించిన కేసులో దర్యాప్తు ముమ్మరం

సీతమ్మధార : పట్టపగలే పార్కింగ్ చేసిన కారు అద్దాలు పగులగొట్టి లోపల బంగారం, నగదు ఉన్న బ్యాగును దొంగలించిన కేసులో నాలుగో పట్టణ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. దీనిపై సెక్యూరిటీ గార్డులను పోలీసులు విచారిస్తున్నట్లు తెలుస్తోంది. విజయవాడకు చెందిన జి.శ్రీని వాస రెడ్డి డైమండ్ పార్క్ వద్ద పార్కింగ్‌లో కారు నిలిపి టిఫిన్ కోసం వెళ్లి తిరిగి వచ్చేసరికి అగంతకులు కారు అద్దాలు పగులగొట్టి లోపల బ్యాగు చోరీ చేసిన విషయం తెలిసిందే. దీనిపై బాధితుడు శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జన సంచారం అధికంగా ఉండే డైమండ్ పార్కు వద్ద పట్టపగలు ఉదయం 11 గంటల సమయంలో చోరీ చేయడాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. దీనిపై ఇప్పటికే సీసీ కెమెరాలను పరిశీలించారు. అలాగే అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు సెక్యూరిటీ గార్డులను విచారిస్తున్నట్లు సమాచారం.

జాతీయ స్థాయి పోటీలకు 13 మంది ఎంపిక

సీతంపేట: ఈ ఏడాది నవంబరు 4 నుంచి 7 వరకు ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ నగరంలో జరగనున్న జాతీయ స్థాయి వేద గణిత విద్య, విజ్ఞాన్ మేళా పోటీలకు శ్రీకృష్ణ విద్యా మందిర్ విద్యార్థులు 13 మంది ఎంపికయ్యారని, కొంత మంది జోనల్ స్థాయికి అర్హత సాధించారని స్కూల్ వ్యవస్థాపకుడు టి.వి.ఎస్.రావు తెలిపారు. ద్వారకానగర్‌లోని పాఠశాలలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో చూపిన ప్రతిభ ఆధారంగా తమ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.నర్మద, ఉపాధ్యాయులు సౌజన్య, అనూరాధ, ప్రసాద్, వైశాలి, చౌదరి, సోనేశ్వరి, దేవి, విద్య, పోటీలకు ఎంపికైన విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు ఆ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

అప్రమత్తతతో దొంగతనాలకు చెక్

- నేర నియంత్రణలో పోలీసులతో సహకరించండి
- ఈస్ట్ క్రైం సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు

అల్లిపురం : దొంగతనాల నివారణపై ప్రజలు అవగాహన కలిగి వుండాలని ఈస్ట్ క్రైం సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు సూచించారు. కాలనీ అసోసియేషన్లు, అపార్టుమెంట్ అసోసియేషన్లు, ప్రతి ఒక్కరు సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ప్రతి సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని తెలిపారు. బుధవారం సాయంత్రం అల్లిపురం మెయిన్‌రోడ్డులో గల శ్రీ వెంకటరామ గ్రంథాలయంలో స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువైన వస్తువులు ఇంట్లో కాకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలన్నారు. వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీని వలన వాహనాలకు రక్షణ ఉంటుందన్నారు. తీర్థయాత్రలు, దూరప్రాంతాలకు వెళ్లినప్పుడు పోలీసులు ఉచితంగా అందించే లాక్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్)ను వినియోగించుకోవాలని కోరారు. ఇల్లు వదిలి దూరప్రాంతాలకు వెళ్లినప్పుడు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలన్నారు. దానివల్ల పోలీసులు ఆ ఇంటికి ఎల్‌హెచ్‌ఎంఎస్ సిస్టమ్ ఏర్పాటు చేస్తారన్నారు. తిరిగి వచ్చే వరకు పోలీసుల పర్యవేక్షణ ఉంటుందని వివరించారు. ఇది పూర్తిగా ఉచితమన్నారు. దీనిని అందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో టూటౌన్ క్రైం ఎస్ఐ కె.శ్రీను, హెడ్ కానిస్టేబుల్ హాఫీజ్, కానిస్టేబుల్ గణేష్ పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న క్రైం సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు

సంస్కృతీ సంప్రదాయాల అధ్యయనంతో దేశానికి మేలు


ఏవీఎన్ కళాశాలను సందర్శించిన కాశ్మీర్ యువత

అల్లిపురం : భారతదేశం సంస్కృతీ సంప్రదాయాలను యువత అధ్యయనం చేయడం ద్వారా దేశానికి మేలు జరుగుతుందని నెహ్రూ యువ కేంద్రం అధికారి జి.ఉమామహేశ్వరరావు అన్నారు. ఏవీఎన్ కళాశాలలో బుధవారం సాయంత్రం యూత్ ఎక్స్చేంజ్ ఘనంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా జమ్మూకాశ్మీర్ నుంచి 120 మంది యువత విచ్చేసి ఏవీఎన్ కళాశాలను సందర్శించారు. కళాశాల చరిత్ర, ఇక్కడ చదువుకున్న విద్యార్థులు దేశ విదేశాలలో ఉన్నత స్థాయిలో ఉన్న విషయాలు తెలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు. యువజన అవార్డు గ్రహీత లీలా ప్రసాద్, శ్రీకాకుళం ఎన్‌వైకే అధికారి ఉజ్వల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.